


DD9 వార్త
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 214 | హైదరాబాద్, మార్చి, బుధవారం 25, 2026 | పేజీలు : 07 | వెల : 3.00

## నగరంలో రాళ్ల వాన

రెండు సెం.మీ. వర్షపాతం నమోదు
ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జామ్
బంజారాహిల్స్, గచ్చిబౌలిలో వడగళ్ల వానతో బెంబేలు
అకాల వర్షంతో ఇబ్బందిపడ్డ వాహనదారులు
14 చోట్ల విరిగిపడిన చెట్లు.. క్లియర్ చేసిన హైడ్రా



03



# లొంగుబాటుకు సిద్ధమైన మావోయిస్ట్ పాపారావు

- మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ
- పశ్చిమ బస్తర్ డివిజన్ కమాండర్‌గా ఉన్న పాపారావు
- రూ.25 లక్షల రివార్డు కలిగిన అగ్రనేత
- మరో 17 మంది అనుచరులు లొంగిపోయే అవకాశం
- నేషనల్ పార్క్ అడవుల్లో మధ్యవర్తులతో చర్చలు
- బీజాపూర్ ఎస్పీ ఎదుట హాజరయ్యే అవకాశం
- ముంచుకొస్తున్న కేంద్రం డెడ్ లైన్ 'మార్చి 31'
- నక్సలిజం అంతానికి దగ్గర పడ్డ గడువు
- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో దశాబ్దాలుగా సాగుతున్న సాయుధ పోరాటం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. మావోయిస్టు పార్టీకి అత్యంత పట్టున్న బస్తర్ ప్రాంతంలో ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగలనుంది. ఆ పార్టీలో అత్యంత కీలకమైన పశ్చిమ బస్తర్ డివిజన్ కమాండర్, మోస్ట్ వాంటెడ్ నేత పాపారావు (అలియాస్ సున్నం చంద్రయ్య) పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఆయనపై రూ. 25 లక్షల భారీ రివార్డును ప్రకటించిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అజ్ఞాతంలో ఉంటూ భద్రతా బలగాలకు సవాలుగా మారిన పాపారావు, ఇప్పుడు తన అనుచరులతో ..మిగతా 2లో

# రాజీనామా చేయడం ఖాయం

## టీపీసీసీ చీఫ్‌కు తేల్చి చెప్పిన జీవన్ రెడ్డి

- నేడు తుది నిర్ణయం ప్రకటిస్తానని వెల్లడి
- ఫలించని మహేశ్ కుమార్ చర్చలు
- కాంగ్రెస్‌తో 40 ఏళ్ల బంధానికి ముగింపు
- సమస్యకు పరిష్కారం లేదన్న జీవన్ రెడ్డి
- గౌరవం లేకుండా రాజకీయాల్లో కొనసాగలేనని వ్యాఖ్య
- రాజీనామా అనంతరం గ్రామాల్లో పర్యటన
- జీవన్‌రెడ్డిని ఆపేందుకు అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు
- ఇంటిపై ఇందిరా భవన్ ఫ్లెక్సీ తొలగించిన మాజీ మంత్రి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పే దిశగా సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. పార్టీ మార్పు దాదాపు ఖాయమని సంకేతాలు ఇస్తూ, రేపు ఉదయం 10 గంటలకు తన తుది నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నట్లు ..మిగతా 2లో



# పద్దుల పుస్తకాలు ఏవి?

- మీరు ఇచ్చేది ఎప్పుడు.. సభ్యులు చదివేది ఎప్పుడు?
- 10 నిమిషాల టీ బ్రేక్ అని గంటలపాటు వాయిదా
- ప్రభుత్వానికి ప్రతిపక్షమంటే కనీస మర్యాద లేదు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్



03

# ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్

- ఈవీ వాహనాలపై భారీ రాయితీలు
- 10 నుంచి 20 శాతం
- ఇస్తామన్న మంత్రి పొన్నం
- రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ పూర్తిగా మినహాయింపు
- షోరూంలోనే వాహన రిజిస్ట్రేషన్
- ఇక ప్రభుత్వ శాఖల్లో అన్నీ ఈవీ వాహనాలే
- కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలంటే ఇకపై 10 నుంచి 20 శాతం వరకు భారీ డిస్కౌంట్ లభించనుంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ రక్షణ కోసం తీసుకున్న ఈవీ పాలసీలో భాగంగా ఈ మంచి నిర్ణయం తీసుకుంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని అధికారికంగా ..మిగతా 2లో




# అందరి సహకారంతో హైదరాబాద్ అభివృద్ధి

- రూ.16 వేల కోట్లతో అభివృద్ధి పనులు
- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి
- హైదరాబాద్‌పై అసెంబ్లీలో వాడివేడి చర్చ
- నిధుల ఖర్చుపై మాటల యుద్ధం
- వచ్చే రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చుకు హామీ
- హెచ్ సిటీ ప్రాజెక్టు కింద 26 కీలక పనులు
- 49 లింక్ రోడ్లు, 3 భారీ ఎలివేటెడ్ కారిడార్లకు గ్రీన్ సిగ్నల్
- మూసీ అభివృద్ధిపై రాజకీయం వద్దన్న మంత్రి
- నగర విస్తరణకు 'ఫ్యూచర్ సిటీ' ఒక్కటే మార్గమని స్పష్టం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ గుండెకాయ వంటి హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై రాష్ట్ర శాసనసభ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు, నిలిచిపోయిన ప్రాజెక్టులు, మూసీ పునరుజ్జీవనం వంటి అంశాలపై బీఆర్ఎస్ సభ్యులు వేసిన ప్రశ్నలకు ప్రభుత్వం తరపున మంత్రి శ్రీధర్ బాబు గట్టిగా బదులిచ్చారు. నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు రూ.16 వేల కోట్లతో బృహత్తర ప్రణాళికలు ..మిగతా 2లో



# దేశ ప్రజలకు మోడీ భరోసా

- ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- భారత్‌పై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
- కరోనా తరహాలోనే రంగంలోకి 7 ప్రత్యేక బృందాలు
- నిత్యవసర ధరలపై నిరంతర నిఘా
- విదేశాల్లో భారతీయుల రక్షణకు చర్యలు
- ఇప్పటి వరకు స్వదేశానికి 3.75 లక్షల మంది
- పుష్కలంగా ముడిచమురు నిల్వలు
- పెట్రోలియం సామర్థ్యం 65 లక్షల టన్నులకు పెంపు
- పేదలకు అండగా ఉండాలని రాష్ట్రాలకు పిలుపు.



03

# మతం మారితే 'ఎస్సీ' హక్కులు వర్తించవు

- సుప్రీం కోర్టు సంచలన తీర్పు
- క్రైస్తవంలోకి వెళ్తే రిజర్వేషన్లకు స్వస్తి
- అట్రాసిటీ చట్టమూ వర్తించదు
- హిందూ, బౌద్ధ, సిక్కు మతాలకే వర్తింపు
- ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం
- పాస్టర్ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- క్రైస్తవ మతంలో కుల వ్యవస్థ లేదన్న కోర్ట్
- రాజ్యాంగంలోని 1950 నిబంధన గుర్తు చేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

మత మార్పిడిలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) మంగళవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఒక వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన తర్వాత, సదరు వ్యక్తికి షెడ్యూల్డ్ కుల (SC) హోదా వర్తించదని తేల్చి చెప్పింది. కేవలం హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతాలను ..మిగతా 2లో

# ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి

ప్రకటించారు.

**ప్రభుత్వ ఉద్యోగులకు 10-20% డిస్కౌంట్ ప్రకటన**

మహీంద్రా ఎలక్ట్రిక్స్, ఆథర్ ఎనర్జీ, గ్రావిటన్ మోటార్స్, ఓలా తదితర ప్రముఖ ఈవీ కంపెనీలు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వంతో ఒప్పందాలు కూడా జరిగాయి. ఉద్యోగులు ఈ డిస్కౌంట్ ద్వారా తక్కువ ధరకు ఎలక్ట్రిక్ కార్లు, బైకులు కొనుగోలు చేయవచ్చు.

**ఈవీ పాలసీలో రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ టాక్స్ 100% మినహాయింపు**

తెలంగాణ ప్రభుత్వం ఈవీ వాహనాలను ప్రోత్సహించడం కోసం రోడ్ టాక్స్ మరియు రిజిస్ట్రేషన్ టాక్స్ పూర్తిగా రద్దు చేసింది. ఇప్పటి వరకు లక్షా 15 వేల 551 ఎలక్ట్రిక్ వాహనాలకు 925.94 కోట్ల రూపాయలు రాయితీలుగా ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇంకా ఎక్కువ మంది ఈవీల వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

**ఈవీ వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది**

ఈవీ పాలసీ అమలు చేసిన తర్వాత తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం 0.60 శాతం నుంచి 1.50 శాతానికి పెరిగింది. ఇది ప్రభుత్వం తీసుకున్న చర్యలు సక్సెస్ అవుతున్నట్లు సూచిస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సుస్థిర రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా సాంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించాలని స్పష్టం చేశారు.

**సీఎం ఆదేశం: కొత్త వాహనాలు అన్నీ ఈవీలే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే అన్ని ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేసే లేదా అద్దెకు తీసుకునే వాహనాలు ఎలక్ట్రిక్ వాహనాలుగానే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఈవీ వాహనాల వినియోగంలో నార్వే, చైనా లాంటి దేశాలతో పోటీ పడుతుందని ఆయన అన్నారు.

**హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చే లక్ష్యం**

సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో




ఉందని చెప్పారు. దీనికోసం సుమారు 2 వేల కిలోమీటర్ల మేర కోర్ ఏరియాను ఈవీ ఆధారితంగా మార్చాలని ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర జనాభాలో 30 శాతం మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని, కాబట్టి గాలి నాణ్యతను కాపాడటం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

**ఛార్జింగ్ స్టేషన్లు, రెట్రోఫిట్టింగ్ పనులు వేగంగా**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ కోర్ ఏరియాలో ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. డీజిల్ ఆటోలను కూడా ఎలక్ట్రిక్‌గా మార్చే రెట్రోఫిట్టింగ్ ప్రక్రియను త్వరగా చేపట్టనున్నారు. 15 ఏళ్లు దాటిన పాత వాహనాలను స్క్రాపేజీకి పంపించి కొత్త ఈవీలను ప్రోత్సహిస్తున్నారు.

**వాహన రిజిస్ట్రేషన్ ఇక షోరూమ్‌లోనే**

వాహన్ మరియు సారథి పోర్టల్‌ల ద్వారా ఇకపై షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇది ప్రజలకు చాలా సులభంగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

**ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి**

సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు ఈవీ వాహనాలను పరిశీలించి, వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా ఈవీలను ఉపయోగించి ప్రజలకు ఆదర్శం చూపాలని ప్రభుత్వం కోరుతోంది.ఈ కొత్త చర్యల ద్వారా తెలంగాణలో కాలుష్యం గణనీయంగా తగ్గి, పర్యావరణం మరింత శుభ్రంగా మారాలని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులందరూ ఈ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# లొంగుబాటుకు సిద్ధమైన మావోయిస్ట్ పాపారావు

మొదటిపేజీ తరువాయి

కలిసి జనజీవన స్రవంతిలో కలిసేందుకు మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది.

**అడవుల్లో రహస్య చర్చలు.. లొంగుబాటుకు గ్రీన్ సిగ్నల్!**

పాపారావును జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి గత కొంతకాలంగా తెరవెనుక భారీ కసరత్తు జరుగుతోంది. భద్రతా బలగాలు ఒకవైపు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తూనే, మరోవైపు మధ్యవర్తుల ద్వారా లొంగుబాటు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగానే కొందరు మధ్యవర్తులు ఛత్తీస్‌గఢ్‌లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలోకి వెళ్లి పాపారావుతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ చర్చలు సఫలమవడంతో, పాపారావుతో పాటు సుమారు 12 నుంచి 17 మంది ఆయన అనుచరులు కూడా ఆయుధాలు వదిలి బీజాపూర్ ఎస్పీ ఎదుట లొంగిపోవడానికి సిద్ధపడ్డట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

**కేంద్రం డెడ్ లైన్ - 'ఆపరేషన్ కగార్' పవర్‌ఫుల్ అడుగులు**

దేశంలో నక్సలిజం నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. మార్చి 31వ తేదీ లోపు మావోయిస్టులు లొంగిపోవాలని, లేనిపక్షంలో ఏరివేత తప్పదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ డెడ్ లైన్ దగ్గర పడుతుండటంతో అడవుల్లో కదలికలు పెరిగాయి. ఇప్పటికే దేవ్ జీ, మల్లోజుల వేణుగోపాల్ వంటి అగ్రనేతలు తమ అనుచరులతో కలిసి పోలీసులకు లొంగిపోగా, ఇప్పుడు పాపారావు కూడా అదే బాట పట్టడం మావోయిస్టు పార్టీకి పెద్ద షాక్ అని చెప్పవచ్చు.

**సీఎం విష్ణుదేవ్ సాయ్ స్పందన: నక్సలిజం అంతం ఖాయం!**

పాపారావు లొంగుబాటు వార్తలపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వంలో నక్సలిజంపై జరుగుతున్న పోరాటం పతాక స్థాయికి చేరిందని ఆయన అన్నారు. "దేశంలో నక్సలిజాన్ని వేళ్లతో సహా పెకిలించాలన్న దృఢ సంకల్పం ఇప్పుడు ఫలితాలను ఇస్తోంది. పాపారావు వంటి అగ్రశ్రేణి కమాండర్లు లొంగిపోవడం ఒక సానుకూల పరిణామం. బస్తర్ ప్రాంతంలో శాంతి స్థాపనకు ఇది నాంది పలుకుతుంది. నక్సలిజం నిర్మూలనకు గడువు దగ్గర పడింది" అని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

**బలహీనపడుతున్న మావోయిస్టు కోట**

గత రెండేళ్లలో భద్రతా బలగాలు బస్తర్ అడవుల్లో చేపట్టిన వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు హతమయ్యారు. ముఖ్యంగా డ్రోన్ కెమెరాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు చేస్తున్న గాలింపు చర్యలతో మావోయిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆహారం, మందులు అందక, స్థానిక గిరిజనుల మద్దతు క్రమంగా తగ్గుతుండటంతో అగ్రనేతలు సైతం అజ్ఞాత జీవితాన్ని వదిలి బయటకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పాపారావు వంటి వ్యూహకర్త పార్టీని వీడటం అంటే పశ్చిమ బస్తర్‌లో మావోయిస్టుల ఉనికి దాదాపు కనుమరుగైనట్లేనని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**రాడార్‌లో అగ్రనేతలు.. తదుపరి లక్ష్యం ఎవరు?**

భద్రతా బలగాల రాడార్‌లో ప్రస్తుతం పలువురు అగ్రనేతలు ఉన్నారు. జార్ఖండ్‌కు చెందిన మిసెల్ బెస్రా కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అలాగే తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ మాజీ చీఫ్ గణపతి, నరహరి వంటి వారి ఆచూకీ కోసం కూడా గాలింపు ముమ్మరం చేశారు. మార్చి 31లోపు వీరు లొంగిపోతే ప్రభుత్వ పునరావాస పథకాలు అందుతాయని, లేనిపక్షంలో ఎన్‌కౌంటర్లతో ఏరివేయక తప్పదని భద్రతాధికారులు స్పష్టం చేస్తున్నారు. పాపారావు లొంగుబాటు ప్రక్రియ విజయవంతమైతే, మిగిలిన నేతలపై కూడా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

**ముగింపు: శాంతి దిశగా బస్తర్ పయనం**

ఒకప్పుడు తుపాకుల మోతతో దద్దరిల్లిన బస్తర్ అడవులు ఇప్పుడు శాంతిని కోరుకుంటున్నాయి. పాపారావు వంటి కీలక నేతలు జనజీవన స్రవంతిలోకి రావడం వల్ల అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగుతాయి. రోడ్ల నిర్మాణం, పాఠశాలలు, ఆసుపత్రుల ఏర్పాటు వేగవంతం అవుతుంది. ప్రభుత్వం కూడా లొంగిపోయిన వారికి మెరుగైన పునరావాసం కల్పిస్తామని హామీ ఇస్తుండటంతో, అజ్ఞాతంలో ఉన్న మరికొందరు యువకులు కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి మార్చి 31 లోపు మావోయిస్టు రహిత భారత్ దిశగా అడుగులు పడుతున్నట్లు కనిపిస్తోంది.

# రాజీనామా చేయడం ఖాయం

మొదటిపేజీ తరువాయి

ఆయన వెల్లడించారు. ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో జరిగిన భేటీ తర్వాత జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు. పార్టీ లోపల తన సమస్యలకు పరిష్కారం దొరకలేదని, ఇప్పుడు తన ముందున్న మార్గం స్పష్టంగా లేదని తెలిపారు.

**భేటీ ఫలించలేదు**

జీవన్‌రెడ్డిని ఒప్పించేందుకు కాంగ్రెస్ నాయకత్వం చివరి ప్రయత్నం చేసినా అది ఫలించలేదు. మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు ఏఐసీసీ ప్రతినిధులు ఆయనను కలిసినా, ఆయన తన నిర్ణయంపై వెనక్కి తగ్గలేదు. పార్టీ ఇచ్చిన హామీలు కూడా ఆయనను ప్రభావితం చేయలేకపోయాయి. దీంతో భేటీ ముగిసిన వెంటనే నాయకులు వెళ్లిపోయారు.మూడు రోజుల క్రితమే ఇతర నేతలు కూడా జీవన్‌రెడ్డిని కలసి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కానీ ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. ఈ పరిణామాలన్నింటి తర్వాత ఆయన రాజీనామా నిర్ణయం మరింత బలపడినట్టు కనిపిస్తోంది.

**40 ఏళ్ల అనుబంధానికి ముగింపు**

జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాల పాటు కొనసాగిన తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీతో తనకు ఉన్న అనుబంధం ఎంతో బలంగా ఉందని, ఇంతకాలం కలిసి పనిచేసిన తర్వాత ఇప్పుడు విడిపోవడం చాలా బాధగా ఉందన్నారు. రాజకీయ జీవితంలో ఇది తనకు కఠినమైన నిర్ణయమని పేర్కొన్నారు.

**సమస్య పరిష్కారం కాలేదన్న బాధ**

తన సమస్యను పరిష్కరించేందుకు ఎవరూ ముందుకు రాలేదని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్టీ వద్ద కూడా, తన వద్ద కూడా పరిష్కారం లేకపోయిందన్నారు. సమస్యను తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడడంతోనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు.

**గౌరవం ముఖ్యం అని స్పష్టం**

ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తికి గౌరవం చాలా ముఖ్యమని జీవన్‌రెడ్డి అన్నారు. అది లేకపోతే రాజకీయాల్లో కొనసాగడం కష్టమని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఆయన అసంతృప్తి తీవ్రతను తెలియజేస్తున్నాయి. తనకు వ్యక్తిగతంగా ఎవరి మీదా విరోధం లేదని, కానీ పరిస్థితులు తనను ఈ దిశగా నెట్టాయని చెప్పారు.

**ప్రజల మధ్యకు వెళ్లే యోచన**

రాజీనామా తర్వాత తన నియోజకవర్గ ప్రజలను కలిసి మాట్లాడతానని జీవన్‌రెడ్డి తెలిపారు. జగిత్యాల ప్రజల అభిప్రాయం తెలుసుకుని తదుపరి రాజకీయ నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానం ఏ దిశగా సాగుతుందో ఇప్పుడే చెప్పలేనని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ నాయకత్వం స్పందన**

ఇక కాంగ్రెస్ నాయకత్వం మాత్రం జీవన్‌రెడ్డిని పార్టీ విడిచిపెట్టకుండా నిలుపుదల చేయాలని చూస్తోంది. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, జీవన్‌రెడ్డి అనుభవజ్ఞుడైన నాయకుడని కొనియాడారు. కొన్ని రాజకీయ నిర్ణయాలు ఆయనకు ఇబ్బందిగా మారాయని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి పార్టీ మారవద్దని కోరామని, ఆయనపై పార్టీకి ఎంతో గౌరవం ఉందని తెలిపారు. భవిష్యత్‌లో ఆయనకు తగిన గుర్తింపు ఇవ్వడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని చెప్పారు. ఆయన నిర్ణయాన్ని పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**'ఇందిరా భవన్' ఫ్లెక్సీ తొలగింపు**

ఈ పరిణామాల మధ్య మరో ముఖ్య ఘటన చోటుచేసుకుంది. జీవన్‌రెడ్డి నివాసంపై ఉన్న 'ఇందిరా భవన్' అనే పేరుతో ఉన్న ఫ్లెక్సీని కార్యకర్తలు తొలగించారు. ఇది ఆయన పార్టీతో ఉన్న అనుబంధానికి ప్రతీకగా భావించబడేది. ఇందిరా గాంధీపై అభిమానంతో ఆయన తన ఇంటికి ఆ పేరు పెట్టుకున్నారు. ఇన్నేళ్లుగా అదే పేరుతో పార్టీ కార్యకలాపాలు నిర్వహించారు. ఇప్పుడు ఆ ఫ్లెక్సీ తొలగించడం ద్వారా కాంగ్రెస్‌కు పూర్తిగా గుడ్‌బై చెప్పే సంకేతాలు ఇచ్చినట్టుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**అనుచరుల ఆందోళన**

జీవన్‌రెడ్డి నిర్ణయంపై ఆయన అనుచరుల్లో కలవరం నెలకొంది. కొందరు ఆయన నిర్ణయానికి మద్దతు ఇస్తుండగా, మరికొందరు పునరాలోచించాలని కోరుతున్నారు. అయితే ఆయన మాత్రం తన నిర్ణయంపై కట్టుదిట్టంగా ఉన్నారు.



**భవిష్యత్‌పై అనిశ్చితి**

తన భవిష్యత్ రాజకీయ అడుగులు ఎలా ఉంటాయో జీవన్‌రెడ్డి ఇంకా వెల్లడించలేదు. ఏ పార్టీలో చేరతారు, లేదా స్వతంత్రంగా కొనసాగుతారా అన్నది రేపటి ప్రకటనతో స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన 'కాలమే నిర్ణయిస్తుంది' అనే ధోరణిలో ఉన్నారు.

**రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం**

జీవన్‌రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీ మారితే రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా జగిత్యాల ప్రాంతంలో రాజకీయ సమీకరణాలు మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఇది ఒక పెద్ద దెబ్బగా మారవచ్చని అంటున్నారు.

# మతం మారితే 'ఎస్సీ' హక్కులు వర్తించవు



మొదటిపేజీ తరువాయి

ఆచరించే వారిని మాత్రమే ఎస్సీలుగా పరిగణించాలని, ఇతర మతాల్లోకి మారిన వారు ఎస్సీ హోదాను, దాని ద్వారా వచ్చే చట్టబద్ధమైన రక్షణలను కోల్పోతారని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

**ఏపీ హైకోర్టు తీర్పుకు సుప్రీం మొగ్గు**

గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. క్రైస్తవ మతంలో కుల వ్యవస్థకు తావులేదని, కాబట్టి ఆ మతంలోకి మారిన వారు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు పెట్టే అర్హతను కూడా కోల్పోతారని హైకోర్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం, హైకోర్టు నిర్ణయం సరైనదేనని వెల్లడించింది. మతం మారిన వెంటనే ఎస్సీ హోదా తక్షణమే మరియు పూర్తిగా రద్దవుతుందని కోర్టు స్పష్టం చేసింది.

**రాజ్యాంగ నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

రాజ్యాంగంలోని (షెడ్యూల్డ్ కులాలు) 1950 నిబంధనల ప్రకారం.. క్లాజ్ 3లో పేర్కొన్న మతాలు (హిందూ, సిక్కు, బౌద్ధం) కాకుండా వేరే ఏ మతాన్ని ఆచరిస్తున్నా వారిని ఎస్సీలుగా గుర్తించకూడదు. ఈ ఉత్తర్వు కింద ఉన్న నిషేధం పూర్తిగా వర్తిస్తుందని కోర్టు గుర్తించింది. పుట్టుకతో ఒక వ్యక్తి ఏ కులానికి చెందినవారైనా, వారు మతం మారిన క్షణం నుంచి ఎస్సీలకు వర్తించే రిజర్వేషన్లు, చట్టబద్ధమైన ప్రయోజనాలు లేదా అర్హతలను క్లెయిమ్ చేయలేరని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇందులో ఎటువంటి మినహాయింపులు ఉండవని వివరించింది.

**కేసు నేపథ్యం ఏమిటి?**

ఈ కీలక తీర్పు ఒక పాస్టర్ దాఖలు చేసిన పిటిషన్ ద్వారా వెలుగులోకి వచ్చింది. క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి, తనపై దాడి జరిగిందని ఆరోపిస్తూ కొందరిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టారు. అయితే, సదరు ఫిర్యాదుదారు ఇప్పటికే క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా కొనసాగుతున్నందున, అతడికి ఎస్సీ హోదా వర్తించదని, కాబట్టి అట్రాసిటీ చట్టం కింద కేసు చెల్లదని నిందితులు కోర్టును ఆశ్రయించారు. ఈ వాదనతో ఏకీభవించిన ఏపీ హైకోర్టు, పాస్టర్ వేసిన ఫిర్యాదును కొట్టివేసింది. దీనిపై సదరు పాస్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా అతడికి చుక్కెదురైంది.

**పాస్టర్‌గా ఉన్న వ్యక్తికి రక్షణ ఉండదు**

విచారణ సందర్భంగా ధర్మాసనం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. పిటిషనర్ దశాబ్ద కాలంగా పాస్టర్‌గా పనిచేస్తున్నారని, క్రమం తప్పకుండా ప్రార్థనలు నిర్వహిస్తున్నారని ఆధారాలు ఉన్నాయని కోర్టు పేర్కొంది. సంఘటన జరిగిన సమయంలో కూడా ఆయన ఒక ఇంట్లో ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు అంగీకరించారు. "పిటిషనర్ క్రైస్తవ మతం నుండి తిరిగి తన పాత మతంలోకి మారినట్లు లేదా ఎస్సీ వర్గం అతడిని తిరిగి స్వీకరించినట్లు ఎక్కడా ఆధారాలు లేవు. ఆయన క్రైస్తవ మతాన్ని కొనసాగిస్తున్నంత కాలం ఆయనను ఎస్సీగా పరిగణించలేం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

**కుల వ్యవస్థ లేని మతాల్లోకి వెళ్తే అంతే!**

క్రైస్తవం లేదా ఇస్లాం వంటి మతాల్లో కుల వ్యవస్థ లేదని, అందరూ సమానమని ఆ మతాల సిద్ధాంతాలు చెబుతాయి. ఒక వ్యక్తి అంటరానితనం లేదా కుల వివక్ష వంటి సామాజిక ఇబ్బందుల నుంచి బయటపడటానికే ఇతర మతాల్లోకి మారుతారని భావించినప్పుడు, తిరిగి అదే కుల హోదాతో ప్రయోజనాలు పొందాలని కోరుకోవడం చట్టవిరుద్ధమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అందుకే హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేస్తూ రాజ్యాంగ ఉత్తర్వులు ఉన్నాయని కోర్టు గుర్తు చేసింది.

**రిజర్వేషన్ల ప్రయోజనాలపై స్పష్టత**

ఈ తీర్పు ద్వారా కేవలం ఎస్సీ/ఎస్టీ చట్టం మాత్రమే కాకుండా, విద్య, ఉద్యోగాల్లో వచ్చే రిజర్వేషన్ల పైన కూడా స్పష్టత వచ్చినట్లయింది. ఎస్సీ రిజర్వేషన్లు పొందాలంటే సదరు వ్యక్తి రాజ్యాంగం గుర్తించిన మతాల్లోనే ఉండాలి. ఇతర మతాల్లోకి మారిన వారు బీసీసి వంటి ఇతర వర్గాల కింద ప్రయోజనాలు పొందవచ్చేమో కానీ, ఎస్సీ కోటా కింద అర్హత సాధించలేరు. దీనివల్ల నకిలీ కుల ధృవీకరణ పత్రాలతో ప్రయోజనాలు పొందే మత మార్పిడిదారులకు ఈ తీర్పు ఒక పెద్ద అడ్డంకిగా మారనుంది.

**సర్వత్రా చర్చనీయాంశం**

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మత మార్పిడిలు అధికంగా జరిగే రాష్ట్రాల్లో ఈ తీర్పు ప్రభావం ఎక్కువగా ఉండనుంది. రాజ్యాంగ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, మత స్వేచ్ఛ ఉన్నప్పటికీ దాని వల్ల వచ్చే సామాజిక హోదా మార్పులను కూడా అంగీకరించాలని న్యాయస్థానం పరోక్షంగా సూచించింది. ఇకపై మతం మారిన వారు ఎస్సీలుగా చట్టబద్ధమైన రక్షణ కోరడం సాధ్యం కాదని ఈ తీర్పుతో స్పష్టమైంది.

# అందరి సహకారంతో హైదరాబాద్ అభివృద్ధి



మొదటిపేజీ తరువాయి

సిద్ధం చేశామని, వచ్చే ఎన్నికల నాటికి నగరం రూపురేఖలు మారుస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**అభివృద్ధిపై మంత్రి రోడ్ మ్యాప్**

శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. 'హెచ్‌సిటీ' పథకం కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులను చేపట్టబోతున్నట్లు వివరించారు. వీటితో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు భారీ ఎలివేటెడ్ కారిడార్లకు ఆమోదం తెలిపామన్నారు. గత రెండేళ్లలో రూ.122 కోట్లు ఖర్చు చేశామని, రాబోయే 202627 ఆర్థిక సంవత్సరంలో రూ.2,250 కోట్లు వెచ్చించబోతున్నామని స్పష్టం చేశారు. కేవలం అంకెలు కాకుండా, క్షేత్రస్థాయిలో మార్పు కనిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిలదీత**

అయితే, ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఆర్‌డీపీ (SRDP) ద్వారా ఫ్లైఓవర్లు నిర్మించి ట్రాఫిక్‌ను 40 శాతం తగ్గించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల పనులు చేస్తామని చెప్పి, 26 నెలల్లో కేవలం రూ.120 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం అంటే నగరాన్ని నిర్లక్ష్యం చేయడమేనని విమర్శించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఖర్చు వేగం చూస్తుంటే పనులు పూర్తయ్యేసరికి మన వళ్లు వస్తారేమోనని ఎద్దేవా చేశారు. ఈస్ట్‌వెస్ట్ కారిడార్‌ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

**నిలిచిపోయిన పనులు.. సామాన్యుల ఇబ్బందులు**

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నగరంలోని రోడ్ల దుస్థితిని ప్రస్తావించగా, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాత టెండర్ల రద్దుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన పనులను రద్దు చేసి, కొత్త టెండర్ల పేరుతో కాలయాపన చేయడం వల్ల ప్రజలపై భారం పడుతోందని ఆమె విమర్శించారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ సమస్యపై మల్లారెడ్డి గళం విప్పారు. ఆ ప్రాంత వాసుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అలాగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారికి అధికారిక కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

**మూసీ రాజకీయం వద్దు: మంత్రి శ్రీధర్ బాబు**

బీఆర్ఎస్ సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు దీటుగా స్పందించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను ఎక్కడా ఆపలేదని, కేవలం ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కొన్ని మార్పులు మాత్రమే చేశామని చెప్పారు. ముఖ్యంగా మూసీ నది అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌కు వలసలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీనిని తట్టుకోవాలంటే నగర విస్తరణ తప్పదని, అందుకే 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రోటోకాల్ విషయంలో గతంలో తమకు జరిగిన అన్యాయాలను గుర్తు చేస్తూ, ఎమ్మెల్యేలతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**ట్రాఫిక్ కష్టాలకు చెక్.. ఉప్పల్ కారిడార్ అప్డేట్**

నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించిన మంత్రి, దాని పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేస్తామని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. నగరవ్యాప్తంగా అండర్ పాస్‌లు, సర్ఫేస్ రోడ్ల నిర్మాణం ద్వారా బాటిల్ నెక్స్ సమస్యలను తొలగిస్తామన్నారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో గణనీయమైన పురోగతి కనిపిస్తుందని, మనవళ్ల వరకు చూడాల్సిన అవసరం లేదని సుధీర్ రెడ్డి విమర్శకు కౌంటర్ ఇచ్చారు.

**కేంద్రంపై ఒత్తిడి తేవాలి**

రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామి కావాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ కేవలం ఒక నగరం మాత్రమే కాదని, రాష్ట్ర ఆదాయానికి మూలాధారమని, అందరం కలిసి దీనిని విశ్వనగరంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

**అభివృద్ధి పథంలో భాగ్యనగరం**

అసెంబ్లీలో జరిగిన ఈ చర్చ ద్వారా హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి, ప్రతిపక్షాల ఆవేదన రెండూ స్పష్టమయ్యాయి. నిధుల కేటాయింపులు, ప్రాజెక్టుల అమలు వేగవంతం అయితేనే భాగ్యనగరవాసులకు ట్రాఫిక్ నరకం నుంచి విముక్తి కలుగుతుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఎన్నికల నాటికి నగరం ఎంతవరకు అద్భుతంగా మారుతుందో వేచి చూడాలి.

# పద్దుల పుస్తకాలు ఏవి?

- మీరు ఇచ్చేది ఎప్పుడు.. సభ్యులు చదివేది ఎప్పుడు?
- 10 నిమిషాల టీ బ్రేక్ అని గంటలపాటు వాయిదా
- ప్రభుత్వానికి ప్రతిపక్షమంటే కనీస మర్యాద లేదు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

సమయపాలన పాటించకపోవడం, పద్దులకు సంబంధించిన పుస్తకాలు ఇవ్వకపోవడం, క్లారిఫికేషన్ లేకపోవడం పట్ల మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నిరసన వ్యక్తం చేసింది. సభను వాకౌట్ చేసి ఆ పార్టీ సభ్యులు బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాట్లాడుతూ, శాసన సభ అంటే అధికారులకు లెక్క లేకుండా తయారైందన్నారు. ''బుధవారం పద్దులు ఉన్నాయి ఎజెండాలో మీరే పెట్టింద్రు. ఇప్పటివరకు ఈ నిమిషానికి కూడా టూరిజం ఆర్ట్స్ అండ్ కల్చర్ పద్దుల బుక్కులు ఇంతవరకు రాలేదు. స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ బుక్స్ ఇవ్వలేదు. మైనార్టీ వెల్ఫేర్ పద్దులు ఇంతవరకు పెట్టలేదు. మీరు ఇప్పటిదాకా పుస్తకాలే వేయకపోతే మెంబర్స్ ఎప్పుడు చదువుకుంటారు. అసెంబ్లీలో ఎప్పుడు మాట్లాడుతారు. అసలు ఆ పద్దు ఏంటో ఏం ప్రతిపాదించారో చదువుకోకుండా ఏ రకంగా మాట్లాడతారు'' అంటూ నిలదీశారు. ఈ ప్రభుత్వానికి శాసనసభ అంటే గౌరవం లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. మంగళవారం ఉదయం కూడా సభ 10 గంటల 6 నిమిషాలకు ప్రారంభం అయిందని, ఏ రోజూ 10 గంటలకు స్టార్ట్ కావడం లేదన్నారు. బ్రేక్ ఫర్ టెన్ మినిట్స్ అంటున్నారని, కొన్ని గంటల తర్వాత గానీ సభను ప్రారంభించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తమ క్లారిఫికేషన్‌కు కూడా టైం ఇవ్వలేదని ఆరోపించారు. తాము సభలో ఎందుకు ఉండాలని పేర్కొన్నారు. వీటన్నిటికీ నిరసనగానే సభ నుంచి వాకౌట్ చేశామని తెలిపారు. తాము వాకౌట్ చేసి బయటికు వచ్చాక అయినా తప్పులు సవరించుకుంటామని ప్రభుత్వం ఒక్క మాటైనా చెప్పలేదన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రతిపక్షమంటే కనీస మర్యాద లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం లోపలికి రావాలని పిలవాలనే సంస్కారం కూడా అధికార పక్షానికి లేకుండా పోయిందని హరీశ్ రావు దుయ్యబట్టారు.

# దేశ ప్రజలకు మోడీ భరోసా

- ఇంధన కొరతపై ప్రధాని మోడీ కీలక ప్రకటన
- ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- భారత్‌పై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు
- కరోనా తరహాలోనే రంగంలోకి 7 ప్రత్యేక బృందాలు
- నిత్యవసర ధరలపై నిరంతర నిఘా
- విదేశాల్లో భారతీయుల రక్షణకు చర్యలు
- ఇప్పటి వరకు స్వదేశానికి 3.75 లక్షల మంది
- పుష్కలంగా ముడిచమురు నిల్వలు
- పెట్రోలియం సామర్థ్యం 65 లక్షల టన్నులకు పెంపు
- పేదలకు అండగా ఉండాలని రాష్ట్రాలకు పిలుపు.

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్)లో కొనసాగుతున్న యుద్ధ జ్వాలలు ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. ఈ యుద్ధం వల్ల ఏర్పడిన అంతర్జాతీయ ఇంధన సంక్షోభం, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రాజ్యసభలో కీలక ప్రకటన చేశారు. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు భారతదేశానికి ఆందోళనకరంగా మారిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, దేశ ప్రజలకు ఆయన భారీ భరోసా ఇచ్చారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ముడిచమురు, గ్యాస్ నిల్వలు మన వద్ద పుష్కలంగా ఉన్నాయని ప్రధాని స్పష్టం చేశారు.

**యుద్ధం - ఇంధన సెగ**

పశ్చిమాసియాలో యుద్ధం మొదలై మూడు వారాలు దాటిందని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా గొలుసును దెబ్బతీసిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ రవాణా చేసే వాణిజ్య మార్గాలపై యుద్ధ ప్రభావం పడిందని ఆయన వివరించారు. భారత్‌కు అవసరమైన ముడిచమురులో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచే వస్తున్నందున, ప్రస్తుత పరిస్థితులు కొంత ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పారు. అయితే, ఈ ప్రభావం సామాన్యుడిపై పడకుండా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని ఆయన సభకు వివరించారు.

**ఏడు ప్రత్యేక బృందాల ఏర్పాటు**

కరోనా కష్టకాలంలో సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి 'ఎంపవర్డ్ గ్రూప్స్' ఏర్పాటు చేసినట్లుగానే, ప్రస్తుత ఇంధన, ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఏడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించిందని ప్రధాని వెల్లడించారు. ఈ గ్రూపులు పెట్రోల్, డీజిల్, ఎరువులు, గ్యాస్ సరఫరాను పర్యవేక్షించడంతో పాటు, మార్కెట్‌లో నిత్యావసర ధరలు పెరగకుండా తక్షణ నిర్ణయాలు తీసుకుంటాయని చెప్పారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో ఈ బృందాలు పనిచేస్తున్నాయని ప్రధాని తెలిపారు.

**వ్యూహాత్మక నిల్వలు - పెరిగిన సామర్థ్యం**

దేశంలో ఇంధన కొరత రాకుండా ప్రభుత్వం గత పదేళ్లుగా తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలను మోదీ గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వ సామర్థ్యాన్ని సుమారు 53 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని, ఇప్పుడు దానిని 65 లక్షల మెట్రిక్ టన్నులకు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. భారత రిఫైనరీల సామర్థ్యం కూడా గత దశాబ్ద కాలంలో వేగంగా పెరిగిందని, దేశం వద్ద ప్రస్తుతం సరిపడా ముడిచమురు నిల్వలు ఉన్నాయని ఆయన దేశవ్యాప్తంగా ఉన్న పౌరులకు హామీ ఇచ్చారు.

**విదేశాల్లోని భారతీయుల భద్రతే ముఖ్యం**

గల్ఫ్ దేశాల్లో సుమారు ఒక కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని, వారి జీవనోపాధి మరియు భద్రత తమ ప్రభుత్వానికి అత్యంత ప్రధానమని ప్రధాని అన్నారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 3.75 లక్షల మందికి పైగా భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించామని వెల్లడించారు. ఇందులో కేవలం ఇరాన్ నుంచే వెయ్యి మందికి పైగా వచ్చారని, అందులో 700 మంది మెడికల్ చదువుతున్న విద్యార్థులు ఉన్నారని తెలిపారు. హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న భారతీయ సిబ్బంది ఉన్న నౌకలను సురక్షితంగా రప్పించడానికి దౌత్యపరమైన చర్చలు జరుపుతున్నామని చెప్పారు.

**శాంతి కోసం దౌత్య ప్రయత్నాలు**

యుద్ధం ఏ సమస్యకైనా పరిష్కారం కాదని, కేవలం చర్చలు మరియు సంప్రదింపుల ద్వారానే శాంతి సాధ్యమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాల అధినేతలతో తాను నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతున్నానని తెలిపారు. సమస్యకు ఒక చక్కని, శాంతియుత పరిష్కారం కనుగొనాల్సిందిగా అన్ని పక్షాలను కోరుతున్నామని చెప్పారు. భారత్ ఎప్పుడూ శాంతి వైపే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**రాష్ట్రాల సహకారం - బ్లాక్ మార్కెటింగ్‌పై నిఘా**

ప్రస్తుత పరీక్షా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పేదలు, వలస కార్మికులపై యుద్ధ ప్రభావం పడకుండా చూడాలని కోరారు. 'పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన' ప్రయోజనాలు లబ్ధిదారులకు సకాలంలో అందేలా చూడాలని రాష్ట్రాలకు సూచించారు. ఇదే తరుణంలో కొందరు స్వార్థపరులు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని, అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

**ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం**

పశ్చిమాసియా సంక్షోభం నుంచి ప్రపంచం తేరుకోవడానికి కొంత సమయం పట్టవచ్చని, కానీ భారత్ ఈ ప్రభావాన్ని తట్టుకోగలదని ప్రధాని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రతి అడుగును జాగ్రత్తగా వేస్తోందని చెప్పారు. ఎంతటి క్లిష్ట సమస్యనైనా భారత్ ఐక్యతతో అధిగమిస్తుందని మోదీ తన ప్రసంగాన్ని ముగించారు.



# నగరంలో రాళ్ల వాన

- రెండు సెం.మీ. వర్షపాతం నమోదు
- ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జామ్
- బంజారాహిల్స్, గచ్చిబౌలిలో వడగళ్ల వానతో బెంబేలు
- అకాల వర్షంతో ఇబ్బందిపడ్డ వాహనదారులు
- 14 చోట్ల విరిగిపడిన చెట్లు.. క్లియర్ చేసిన హైడ్రా

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

వేసవి తాపం క్రమంగా పెరుగుతున్న సమయంలో గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం పడింది. మంగళవారం సాయంత్రం ఆరున్నర గంటల నుంచి సుమారు ఏడున్నర గంటల వరకు, దాదాపు గంట సేపు వర్షం పడింది. కొన్నిచోట్ల వడగళ్ల వాన కురిసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ఏరియాల్లో రోడ్లపై నీరు నిలిపోయింది. 14 చోట్ల చెట్లు విరిగిపడగా, హైడ్రా క్లియర్ చేసింది.

**ఐటీ కారిడార్‌లో రాళ్ల వాన**

ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలిలో వడగళ్ల వాన పడింది. ఫలితంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. బంజారాహిల్స్‌లో వడగళ్ల వానకు జనం ఇబ్బంది పడ్డారు. రోడ్డు నెంబర్ 12లో భారీ వర్షం పడింది. కార్లలో ఉన్న వారు అద్దాలు పగిలిపోతాయేమో అని కంగారు పడ్డారు. మణికొండలోనూ వడగళ్ల వాన కురిసింది.

**పలుచోట్ల భారీ వర్షం**

మియాపూర్, కూకట్‌పల్లి, బోరబండ, చందానగర్, జూబ్లీహిల్స్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లోనూ వర్షం పడింది. కొండాపూర్, యూసుఫ్‌గూడ, ఉప్పల్, రామంతాపూర్, అంబర్ పేట్, హాఫీజ్‌పేట ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. సుమారు గంట వ్యవధిలో దాదాపు రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించారు.

**రంగంలోకి హైడ్రా**

వర్షం కారణంగా 14 చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడగా, సమాచారం తెలుసుకున్న హైడ్రా హుటాహుటిన రంగంలోకి దిగి క్లియర్ చేసింది. గచ్చిబౌలిలో విరిగిపడిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో రంగంలోకి దిగిన హైడ్రా, గంట వ్యవధిలోనే 12 చోట్ల కొమ్మలను తొలగించగా, అర్ధరాత్రి వరకు మరో రెండు చోట్ల కొమ్మలను తొలగించే సహాయక చర్యలను చేపట్టింది.





# పశువైద్య శిబిరంలు తనిఖీ చేసిన జిల్లా అధికారి రాథోడ్ రామారావ్.

**బజార్హత్నూర్, మార్చి, 24(డిడి 9వార్త ):-**

బజార్హత్నూర్ మండలంలోని గంగాపూర్, గులాబ్ తండా గ్రామాలలో మంగళవారం రోజు పశువుల డాక్టర్ అధ్వర్యంలో ఉచిత గాలి కుంటూవ్యాధి (ఎఫ్ఎండి )నివారణ టీకాల శిబిరం నిర్వహించారు.రెండు గ్రామాలలోని పలుమేకలు,పశువులకు టీ కాలు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రాథోడ్ రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పోషణతో రైతులు మంచి ఆదాయం పొందాలని,వాటిని సంరక్షణ చేసుకొనుటకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాపూర్ గ్రామ సర్పంచ్ టీ.సుభాష్,గులాబ్ తండా సర్పంచ్ రాథోడ్ లక్మి,సిబ్బంది,సి ఎచ్ అరవింద్,ఠాకూర్ సూరజ్,జాడే దుర్గాజీ,మారుతీ,జగన్,సుధాకర్, ఆయా గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవు.

- పార్టీల మధ్య, గ్రూపుల మధ్య, రాజకీయ వర్గాల మధ్య రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్న వ్యక్తులపై చర్యలు.
- సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూన్న కొందరు వ్యక్తులు.
- సోషల్ మీడియా వాట్సప్ ద్వారా మితిమీరిన మాటలతో రాజకీయ విమర్శలు
- ఇతరులను కించపరిచేలా, గొడవలకు దారి తీసేలా వ్యక్తుల సంభాషణలు.
- చూసి రిమూవ్ చేయని, వాట్సాప్ గ్రూపు అడ్మిన్ లపై చర్యలు తప్పవు.
- అతిక్రమించిన వారికి కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు.
- బోథ్ సీఐ డి గురుస్వామి



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 24(డి డి 9):-**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ పట్టణంలో ఈరోజు కొందరు వ్యక్తులు పార్టీల మధ్య, గ్రూపుల మధ్య మరియు రాజకీయ వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం తో, ఈ నేపథ్యంలో బోథ్ పోలీస్ ప్రత్యేకంగా నిఘా పెంచి, పరిస్థితులను సమీక్షించినట్లు బోథ్ సీఐ డి. గురుస్వామి తెలిపారు. బోథ్ పట్టణం లోని కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లు, ముఖ్యంగా వాట్సాప్ గ్రూపులు ద్వారా అసభ్యకరమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, రాజకీయ విమర్శలను మితిమీరిన పదజాలంతో వ్యక్తపరచడం, ఇతరులను కించపరచేలా పోస్టులు, సందేశాలు పంపడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి చర్యలు సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో నిబంధనల అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా ద్వేషపూరిత ప్రచారం, తప్పుడు సమాచారం వ్యాప్తి, వ్యక్తులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు సైబర్ నేరాల కింద పరిగణించబడతాయని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపుల అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో జరిగే చర్చలపై పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, రెచ్చగొట్టే, అసభ్యకర లేదా చట్టవిరుద్ధమైన పోస్టులను వెంటనే తొలగించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. అలాంటి పోస్టులను చూసి కూడా తొలగించకుండా నిర్లక్ష్యం చేసిన గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరులు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరకర పోస్టులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని బోథ్ సీఐ డి. గురుస్వామి స్పష్టం చేశారు.

# బోర్గం గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలోని బోర్గం శాఖ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మంగళవారం సందర్శించారు. గ్రంథాలయ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఉన్న వసతులు, పుస్తకాల లభ్యతపై సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుత గ్రంథాలయ భవన పరిస్థితిని గమనించిన కలెక్టర్, పాఠకులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అనువైన స్థలాన్ని కేటాయించే విషయంపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. త్వరలోనే స్థల సేకరణ ప్రక్రియ పూర్తి చేస భవన నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రంథాలయానికి వస్తున్న పాఠకులు, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. గ్రంథాలయంలో తాగునీరు, కూర్చోవడానికి సరిపడా కుర్చీలు, వెలుతురు వంటి కనీస సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠకుల సూచనలను పరిగణనలోకి తీసుకుని, గ్రంథాలయ వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, బోర్గం లైబ్రేరియన్ నర్సయ్య, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.







# బజార్హత్నూర్లో గాలివాన భీభత్సం.

**బజార్హత్నూర్, మార్చి,24,(డిడి 9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల కేంద్రంతో పాటు గిర్నూర్, కొలహరి, జాతర్ల, చిన్నహత్నూర్,బలన్పూర్ తదితర గ్రామంలో మంగళవారం రోజు పగలు 3 గంటల ప్రాంతంలో గాలి వాన కుర్సీ భీభత్సం సృష్టించింది.బజార్ హత్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయంఏర్పడింది. పెద్ద పెద్ద చినుకులు,చిన్న చిన్నవాన రాళ్లు పడ్డవి. మామిడి చెట్ల పిందెలు, పూత నెల రాలింది. కోతకు వచ్చిన కొన్నిగోధుమ,ధనియా,లాంటి వాణిజ్య పంటలకు కొంత అంతరాయం ఏర్పడింది.మొక్కజొన్న, జొన్న చెల్లకు కొంత లాభమని పేర్కొనవచ్చు. ఉక్క పోత,గాలివాన,ఉరుములు,మెరుపులతో కూడిన వానతో పుడమి తల్లి పులకరించింది.





# శనగ రైతుపై పరిమితి పోటు



- **ఎకరానికి 7 క్వింటాళ్లే కొనడంపై సాలూర రైతుల ఆగ్రహం**
- **కనీసం 10 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

ఆరుగాలం కష్టపడి పండించిన శనగ రైతులను ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. సాలూర మండల కేంద్రంలోని శనగ రైతులు ప్రభుత్వం విధించిన కొనుగోలు పరిమితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధన రైతులకు శాపంగా మారింది. ఈ ఏడాది శనగ పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఎకరానికి సగటున 10 నుండి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండగా, ప్రభుత్వం మాత్రం కేవలం 7 క్వింటాళ్లకే పరిమితం చేయడంపై రైతులు మండిపడుతున్నారు. మిగిలిన 3 నుండి 5 క్వింటాళ్ల దిగుబడిని ఎక్కడ అమ్ముకోవాలని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో పరిమితి తక్కువగా ఉండటంతో, మిగిలిన పంటను బయట మార్కెట్లో అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు, దళారీలు సిండికేట్గా మారి ధరలను భారీగా తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని సాలూర గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, కొనుగోలు పరిమితిని ఎకరానికి కనీసం 10 క్వింటాళ్లకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు, సాలూర గ్రామ రైతులు పాల్గొన్నారు.



# రుద్రూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం : 18 మందికి గాయాలు

- **లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు**
- **సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ సాయి చైతన్య**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**





రుద్రూర్ మండల కేంద్రంలోని జె.ఎం.సి కాలనీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 18 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొనడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టీజీ 16 జెడ్ 0102 మంగళవారం ఉదయం 11:15 గంటల సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ టీఎస్ 22 టి 3348 ను అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఎగిరి పడటంతో 18 మందికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు.

**రంగంలోకి పోలీస్ కమిషనర్**

ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించిన ఆయన, క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్లలో బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని అధికారులను ఆదేశించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీపీ, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రహదారిపై డివైడర్లు, రోడ్ స్టాపర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెసిబి సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ను పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ విజయబాబు, రుద్రూర్ ఎస్సై సాయన్న, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి, ఎడపల్లి ఎస్సై రమా, ఆర్టీసీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





## ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుని కలిసి ధన్యవాదాలు తెలిపిన ఆడే గజేంధర్ & కాంగ్రెస్ శ్రేణులు

**బజార్హత్నూర్, మార్చి 24(డిడి9వార్త ):-**

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ & కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్ లో ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుని మంగళవారం రోజు మర్యాద పూర్వకంగా కలిశారు.ఆదిలాబాద్ జిల్లా బోథ్ పట్టణ కేంద్రంలో అగ్నిమాపకకేంద్రంమంజూరు కోసం మంత్రి చేసిన కృషికి కృతజ్ఞత చెప్పి ఆయనను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, బోథ్ ప్రాంత అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు తీసుకుంటున్న చొరవ అభినందనీయమని అన్నారు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుతో అత్యవసర సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వచ్చి ప్రజలకు ఉపయోగపడుతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆడేగజేందర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుల అరుణ్,జెల్కేపాండురంగ్, భూమన్న తదితరులు ఉన్నారు.



## డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్థలం కేటాయించాలి: ఎం.ఆర్.పి.యస్ రాష్ట్ర నాయకులు

**బీర్కూర్, మర్చి 24(డిడి9 వార్త):**

బీర్కూర్ మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో భారత దేశ మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త, స్వతంత్ర సమరయోధుడు డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (మాదిగ దండోరా) రాష్ట్ర నాయకుడు కాదేపురం గంగారాం కోరారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ రెంజర్ల అనీల్కు వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం గంగారాం మాట్లాడుతూ, ఏప్రిల్ 5న జరగనున్న జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను బరంగ్ ఏడ్గి గ్రామంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజునే విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాచకొండ బాలయ్య, అన్నం అనీల్, లక్కపల్లి హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ బోయి లాలయ్యతో పాటు రాచకొండ గంగారాం, బోయి చిన్న సాయిలు, టేకుర్ల గంగారాం, రాచకొండ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# విపత్తు నిర్వహణపై టేబుల్టాప్ వ్యాయామం

**కామారెడ్డి, మర్చి 24(డిడి9 వార్త):**

కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణపై టేబుల్టాప్ వ్యాయామం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ అధ్యక్షత వహించారు. ఈ వ్యాయామం వరదల వంటి విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధత, శాఖల మధ్య సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన వంటి అంశాలపై కేంద్రీకృతమైంది. వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ బాధ్యతలపై చర్చించడంతో పాటు, అనుకరణ ద్వారా విపత్తు పరిస్థితులను అంచనా వేశారు. సమాచార పంచకం, సహాయక చర్యలు, పునరావాస చర్యలపై విస్తృతంగా చర్చించారు. అగ్నిమాపక శాఖ అధికారులు తమ అత్యవసర వ్యూహాలను వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళిక అవసరమని, సమాజంలో అవగాహన పెంపు కూడా అత్యంత ముఖ్యమని తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సూచనలను పరిగణలోకి తీసుకుని జిల్లా విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రబీ సీజన్‌కు ప్యాడి కొనుగోళ్లపై అవగాహన సమావేశం

- రబీ సీజన్‌కు ప్యాడి కొనుగోళ్లపై అవగాహన సమావేశం

**కామారెడ్డి, మార్చి 24(డిడి9 వార్త):**

రాబోయే రబీ మార్కెటింగ్ సీజన్ 2025-26కి సంబంధించిన ప్యాడి కొనుగోళ్లు, ఓపిఎంఎస్ ఎంట్రీలపై జిల్లా స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పిఎసిఎస్, ఐకెపి వంటి కొనుగోలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 1, 2026 నుంచి ప్యాడి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకాలు, మాయిశ్చర్ మీటర్లు, ప్యాడి క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే ఓఎంపిఎస్, ప్రొక్యూర్మెంట్ యాప్ లో రైతుల వివరాలు సకాలంలో నమోదు చేయడం, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం పాటించడం, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమం రెండు విడతలుగా నిర్వహించగా, ఉదయం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు, మధ్యాహ్నం బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలకు శిక్షణ ఇచ్చారు.సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా సహకార అధికారి, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, జిల్లా మేనేజర్ (సివిల్ సప్లైస్) తదితరులు పాల్గొన్నారు.










## గాలివాన భీభత్సం కొలహారి శివారంలో అడ్డం పడ్డా మొక్కజొన్న.

**బజార్హత్నూర్, మార్చి 24 (డిడి 9వార్త ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలంలోని కొలహరి శివారంలో మంగళవారం రోజు కురిసిన గాలివానకు మొక్కజొన్న పంట చేల్లన్ని అడ్డంగా పడి పోయినవి. కొలహరి గ్రామంలోని ఇళ్లపైకప్పులు, రేకులు గాలిదుమారానికి లేచి పోయి భీ భ త్సం సృష్టిం చిం ది . మం డ ల కేంద్రంలో సైతం ఇదే స్థితి ఏర్పడింది.కరెంటుకు అంతరాయం కలిగినది. వెంటనే కరెంటు అధికారులు స్పందించి చెట్లుతొలగింపచేసి,తీగలకు మరమ్మత్తులు చేసి కరెంటు పునరుద్దరణ పనులు చేశారు.



## రాజకీయ ఎదుగుదలతోనే వైశ్యులకు సామాజిక గుర్తింపు

- వైశ్య సమాజానికి రాజకీయ చైతన్యం అవసరం: డాక్టర్ బాలు

**కామారెడ్డి, మార్చి 24(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ పరంజ్యోతి భగవతి ఆలయంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ఆధ్వర్యంలో రాజకీయ పదవులు పొందిన ఆర్యవైశ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ మాట్లాడుతూ వైశ్య సమాజానికి రాజకీయ చైతన్యం అత్యంత అవసరమని అన్నారు. రాజకీయాల్లో ఎదుగుదల సాధించినప్పుడే వైశ్యులకు సమాజంలో మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. వైశ్యులు ఐక్యంగా ముందుకు సాగితేనే రాజకీయంగా బలపడతారని, అప్పుడు సమాజానికి తగిన స్థానం దక్కుతుందని తెలిపారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా నియామకం పొందిన గంప ప్రసాద్, పాత దివ్య, వలిపిశెట్టి భాస్కర్‌లను ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పదవులు పొందడం మాత్రమే గొప్పదనం కాదని, ఆ పదవులకు తగిన విధంగా ప్రజలకు సేవ చేయడం ద్వారానే నిజమైన గుర్తింపు వస్తుందని వారు సూచించారు. వైశ్య సమాజంతో పాటు సామాజిక సేవలోనూ చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఆలయంలో ఐవిఎఫ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకటేష్, ఉపాధ్యక్షులు కొత్త బీమ్ రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు బుక్క రజని, ప్రధాన కార్యదర్శి చిలువేరి శ్రీదేవి, ఉపాధ్యక్షులు కస్వ లలిత దొంతి, అర్చన జిల్లా, మురికి సౌమ్య, ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షులు ఎల్లంకి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి ఎర్రం విజయ్ కుమార్, కోశాధికారి నంగు గునూరి కాశీనాథం, సలహాదారులు రాజూరి మనోహర్, జిల్లా పిఆర్వో కొత్త సంఘరాజు, దోమకొండ శ్రీనివాస్, మురికి సంపత్ తదితరులు పాల్గొన్నారు.




## గురుకుల ప్రవేశ పరీక్షల్లో మెరిసిన URS ఆదిలాబాద్ విద్యార్థులు

**ఆదిలాబాద్ జిల్లా, మార్చ్ 24(డి డి 9):-**

అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ (URS) ఆదిలాబాద్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు గణనీయంగా విజయాన్ని సాధించారు. విజయం సాధించిన విద్యార్థులలో జాదవ్ సిద్ధు, పెందుర్ జ్యోతిరామ్, S. శ్రవణ్, S. నాగేష్, P. నర్సింలు, A. రాజశేఖర్ గురుకుల విద్యాసంస్థల్లో సీట్లు సంపాదించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు. పాఠశాలలో నాణ్యమైన బోధన, క్రమశిక్షణ, ప్రత్యేక శిక్షణ కారణంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. గురుకుల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేకంగా నిర్వహించిన కోచింగ్ తరగతులు విద్యార్థుల విజయానికి ప్రధాన కారణమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, "మా విద్యార్థులు సాధించిన ఈ విజయంతో పాఠశాల గౌరవం పెరిగింది. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని ఆశిస్తున్నాం" అని అన్నారు. విజయం సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు




## మైనర్లపై నేరాలు, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం




**పిట్లం, మార్చి 24(డిడి9 వార్త):**

పిట్లం మండలంలోని చిల్లర్గీ జిల్లా పరిషత్ పాఠశాలలో మైనర్లపై జరుగుతున్న నేరాలు ,సైబర్ మోసాలు మరియు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కామారెడ్డి జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు,పిట్లం సబ్ఇన్స్పెక్టర్ వెంకటరావు సూచనలతో పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా విద్యార్థులకు మైనర్లపై జరుగుతున్న నేరాలు,ప్రేమ పేరుతో జరిగే మోసాలు,సైబర్ నేరాల గురించి వివరించారు.అలాగే సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వాటిని జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో షీ టీమ్ నంబర్ 8712686094,సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్ 1930,అలాగే అత్యవసర సహాయం కోసం డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. మానవ అక్రమ రవాణా ప్రమాదాల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి లక్ష్యంతో చదువుకుని జీవితంలో ముందుకు సాగాలని,చిన్న పొరపాటు చేసినా జీవితాలు నాశనం కావచ్చని హెచ్చరించారు. తల్లిదండ్రులు చెప్పిన మాటలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి,హెడ్ కానిస్టేబుల్ యు.శేషరావు,పీసీ సాయిలు పాటలు మరియు మాటల రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పిట్లం హెడ్ కానిస్టేబుల్ కె. శ్రీనివాస్,బాన్సువాడ షీ టీమ్ సభ్యులు పీసీ అనిల్,డబ్ల్యూపీసీ పార్వతి,పీసీ రాజేంద్ర కుమార్,పాఠశాల హెడ్ మాస్టర్ హరిసింగ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






## పోతంగల్ గ్రామ తైబజార్ వేలం పాట నిర్వహణ

**నిజామాబాద్, పోతంగల్,మర్చి 24(డిడి9 వార్త):**

మండల కేంద్రంలోని పోతంగల్ గ్రామంలో ఈరోజు తైబజార్‌కు సంబంధించిన రోజువారి సంత, వారం సంత, మేకల సంత, పశువధలకు సంబంధించిన వేలంపాట నిర్వహించారు.రోజువారి సంతను రూ.1,50,000కు చెట్టి ప్రవీణ్ కైవసం చేసుకున్నారు. వారం సంత రూ.4,60,000 వద్ద ఎర్రోళ్ల లక్ష్మణ్ వద్ద మధ్యలో ఆగింది. మేకల సంత రూ.5,00,000 వద్ద కన్నం రమేష్ వద్ద మధ్యలో నిలిచింది. పశువధ హక్కులను రూ.6,100కుఇబ్రహీం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరు సంధ్య బజరంగ్, గ్రామ సెక్రటరీ యాదవ్, ఉప సర్పంచ్ నబి, వార్డు సభ్యుడు పంచ్ రెడ్డి అనిల్, జీపీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సెక్రటరీ యాదవ్ మాట్లాడుతూ, మిగతా వేలంపాటలను మరో రెండు రోజుల్లో మళ్లీ కొనసాగిస్తామని తెలిపారు.



## ఓల్డ్ పోతంగల్‌లో హనుమాన్ విగ్రహాల ఘన ఊరేగింపు





**పోతంగల్, మార్చి 24(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని ఓల్డ్ పోతంగల్ గ్రామంలో హనుమాన్ మందిరం పునర్ నిర్మాణం పూర్తయ్యింది. ఆలయంలో ఏప్రిల్ 2న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించనుండడంతో కొత్త హనుమాన్ విగ్రహాలను గ్రామానికి తీసుకువచ్చారు.ప్రతిష్టాపనకు ముందు 11 రోజుల పాటు మాలధారణ చేసి నిష్టగా ఉన్న భక్తులు, గ్రామస్తులు కలిసి హనుమాన్ విగ్రహాలను ఘనంగా ఊరేగింపుగా హనుమాన్ మందిరం వద్దకు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా మాలధారణ చేసిన స్వాములు ఆలయంలో భజనలు నిర్వహిస్తూ పంచామృతాలతో పాలాభిషేకాలు చేశారు. అలాగే భజనలతో పాటు నృత్యాలు నిర్వహించి భక్తి పరవశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వేసవి వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, దీనిపై అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉపాధి హామీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు మరియు వ్యవసాయ కూలీలు ఎండలో పనిచేసేటప్పుడు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, వారి పని ప్రదేశాల్లో తగిన నీడ కోసం టెంట్లు మరియు తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో సరిపడా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అవసరమైన ఆరోగ్య సూచనలు అందించాలని సూచించారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బ నివారణ పద్ధతులపై కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీకి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకూడదని, బయటకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు కూడా ఎండల తీవ్రతపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా వడదెబ్బ కారణంగా ప్రాణనష్టం జరగకుండా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# బోధన్ జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాల మెరుగుదలకు చర్యలు

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**బోధన్ , నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సందర్శించి, అక్కడి వైద్య సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ బ్లాక్, ప్రసవాల విభాగం, పోస్ట్ ఆపరేటివ్ వార్డులతో పాటు శిథిలావస్థకు చేరిన ఐసోలేషన్ వార్డు భవనాన్ని ఆమె తనిఖీ చేశారు. పేద ప్రజలకు అందే వైద్య సేవలలో ఎలాంటి జాప్యం జరగకూడదని, మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. అనంతరం ఆసుపత్రి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యకు అనుగుణంగా సేవలను విస్తరించాలని సూచించారు. ప్రస్తుతం ఒకరే గైనకాలజిస్ట్ అందుబాటులో ఉన్నందున, మహిళా రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరో గైనకాలజిస్ట్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై సామాన్య ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని హితవు పలికారు. ముఖ్యంగా ఓ.పి విభాగంలో రోగులకు వేచి ఉండే సమయాన్ని తగ్గించి, మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. వేసవి కాలంలో ప్రబలే డీహైడ్రేషన్, ఫుడ్ పాయిజనింగ్ వంటి కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్న చిన్న సమస్యలకు రోగులను నిజామాబాద్ జిల్లా కేంద్రానికి రిఫర్ చేయకుండా, స్థానికంగానే పూర్తిస్థాయి వైద్యం అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, తాను తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి

- **పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రమాదాల నివారణపై ఆర్టీసీ, రవాణా, అటవీ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా కార్యక్రమాలను ముమ్మరం చేయడంతో పాటు ప్రమాదాలకు పొంచి ఉన్న ముప్పులను ముందుగానే గుర్తించాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు, ఆక్రమణల నిర్మూలన, గుంతలు పడిన రోడ్డు భాగాల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మలుపులు, వంతెనలు, కల్వర్టులు మరియు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ల వద్ద రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో వాహనదారులకు దారి స్పష్టంగా కనిపించేలా రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, ప్రధాన కూడళ్లలో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. భారీ ట్రక్కులు, ఆర్టీసీ మరియు ప్రైవేట్ బస్సు డ్రైవర్లకు నిరంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి, ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ జి.బస్వారెడ్డి, జిల్లా రవాణా అధికారి జె. ఉమామహేశ్వర రావు, ఆర్టీసీ డీఎం బి. ఆనంద్, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# రైతు భరోసా నిధులను రైతులు డ్రా చేసుకునేలా పూర్తి స్వేచ్ఛనివ్వాలి

- **జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, మార్చి : 24 (డిడి9వార్త ప్రతినిధి) :-**




రైతు భరోసా నిధులను రైతులు డ్రా చేసుకునేలా పూర్తి స్వేచ్ఛనివ్వాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా బ్యాంక్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షత నిర్వహించారు.ముందుగా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్ జిల్లా నివేదిక వివరిస్తూ, ప్రయారిటీ సెక్టర్ డిపాజిట్ క్రింద రూ.4678.87 కోట్లు, ప్రయారిటీ సెక్టర్ అడ్వాన్సెస్ కింద రూ.7991.86 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి నిధుల పంపిణీలో బ్యాంకర్లు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలుసృష్టించకూడదని,రైతులు తమకు కావాల్సినప్పుడు ఆనగదును డ్రా చేసుకు నేలా పూర్తి స్వేచ్ఛనివ్వాలని బ్యాంక్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక బలోపేతానికి కొత్తగా ఏర్పడే స్వయం సహాయక సంఘాల ఖాతాలను, దివ్యాంగులు, వృద్ధులు, కిశోర బాలికల సంఘాల ఖాతాలను డిసిసిబిలోనే ప్రారంభించాలాచూడాలని సూచించారు.పర్యావరణ హిత ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు 'పీఎం సూర్య ఘర్' (రూఫ్ టాప్ సోలార్), 'పీఎం కుసుమ్' పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకుప్రభుత్వం దాదాపు రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తోందని, దీనిని బ్యాంకర్లు తమ లోన్ పోర్ట్‌ఫోలియోలో ముఖ్యమైన భాగంగా చేర్చుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునికతను పెంచేందుకు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ఫండ్ ద్వారా అగ్రికల్చర్ డ్రోన్ల కొనుగోలుకు 40% సబ్సిడీ, వడ్డీ రాయితీతో కూడిన రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరారు. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పథకం కింద టైలరింగ్, మగ్గం పని, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, జనపనార సంచుల తయారీ వంటి అంశాల్లో శిక్షణ పొందిన వారికి బ్యాంకులు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. భూమి రిజిస్ట్రేషన్ల సమయంలో బ్యాంక్ ఛార్జ్ ఉన్న భూములపై తలెత్తుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పీఎం స్వ నిధి స్ట్రీట్ వండర్స్ కు అధికంగా సహాయంచేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. పీఎంఈజీపి, పీఎం ఎఫ్ఎంబి, పీఎం విశ్వకర్మ పురోగతిపై సమీక్షించారు. అనంతరం నాబార్డ్ రూపొందించిన 2026-27 ఆదిలాబాదు జిల్లా ఆర్థిక సంవత్సరపు 'పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్' పుస్తకాన్ని కలెక్టర్, పిఓ ఆవిష్కరించారు. ఈ సమీక్షా సమావేశంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మాట్, డిఆర్డీఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, పశు సంవర్ధక శాఖ అధికారి రామారావు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, ఆర్.బి.ఐ ఎజిఎం యశ్వంత్ సాయి, నాబార్డ్ డిడియం అబ్దుల్ రావుఫ్, టి.బి. బి.ఆర్ ఎం గిరి నాయక్, సిఈఓ రవి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

- **అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్**

**నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

జిల్లాలో యాసంగి ధాన్యం సేకరణ ప్రక్రియ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత పారదర్శకంగా సాగాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.27 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 11 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 669 కొనుగోలు కేంద్రాల ద్వారా 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ధాన్యం సేకరణలో క్షేత్రస్థాయి అధికారులు అంకితభావంతో పనిచేయాలని, ముఖ్యంగా వేసవి తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నీడ, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ధాన్యం తూకం, తరుగు వంటి అంశాల్లో రైతులకు నష్టం వాటిల్లకుండా పకడ్బందీ పర్యవేక్షణ ఉండాలని, నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలను అస్సలు ఉపేక్షించబోమని హెచ్చరించారు. సేకరణకు అవసరమైన 2.25 కోట్ల గన్నీ బ్యాగులను సిద్ధం చేస్తున్నామని, ధాన్యం సేకరించిన వెంటనే టాబ్ ఎంట్రీలు పూర్తి చేసి రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రవాణా విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాలు మరియు హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని ఆయన కోరారు. రైతులు కూడా తమ ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, శుభ్రపరిచి కేంద్రాలకు తీసుకురావాలని, తద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందవచ్చని సూచించారు. దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి వీరస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

# క్షయ రహిత సమాజమే మన లక్ష్యం

- **డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజశ్రీ**

**నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

క్షయ రహిత సమాజ స్థాపనే మనందరి అంతిమ లక్ష్యం కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఏడవ అంతస్తు సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏటా మార్చి 24న ఈ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ప్రజల్లో వ్యాధిపై అవగాహన పెంచడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. క్షయ ఒక అంటువ్యాధి అయినప్పటికీ, దీనిని పూర్తిగా నయం చేయవచ్చని ఆమె స్పష్టం చేశారు. సరైన సమయంలో పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందితే క్షయపై విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ఉచిత పరీక్షలు, మందులతో పాటు రోగులకు పోషకాహార సహాయాన్ని కూడా అందిస్తోందని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. క్షయ బాధితుల పట్ల సమాజంలో ఎటువంటి వివక్ష ఉండకూడదని, వారికి మానసిక ధైర్యాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న వి కెన్ ఎండ్ టిబి అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు.






# సాలూర పిహెచ్‌సిలో ప్రజాపాలన ఉచిత ఆరోగ్య శిబిరం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరానికి పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు రోగులను పరీక్షించారు. ముఖ్యంగా గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్ విభాగాలకు సంబంధించి ప్రత్యేక చికిత్సలు అందించారు. అలాగే కంటి మరియు దంత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. పేద ప్రజలకు నిపుణులైన డాక్టర్ల సేవలను చేరువ చేయడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రాజ్‌కుమార్, పిహెచ్ఎన్ ఇందిర, హెల్త్ సూపర్వైజర్ సాయి కుమారి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని రోగులకు సేవలు అందించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

# విద్యార్థుల కంటి వెలుగుకు అద్దాల భరోసా

- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా 24మార్చి(డీడీ9 వార్త) :**

నేత్ర సమస్యలను అశ్రద్ధ చేయకూడదని, శరీర అవయవాలలో అత్యంత ప్రధానమైన కంటి చూపును ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బోర్గాం(పి) ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థిని, విద్యార్థులకు కలెక్టర్ ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి చూపు మందగించకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ఆకు కూరలు, క్యారెట్ వంటి పోషక పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఇదివరకు తాను కూడా దృష్టి లోపంతో ఇబ్బంది పడ్డానని, అయితే తగిన వ్యాయామాలు, సరైన ఆహారపు అలవాట్లతో ఆ సమస్యను అధిగమించానని తన వ్యక్తిగత అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. జిల్లాలో సుమారు 70 వేల మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 41 వేల మందికి పరీక్షలు పూర్తయ్యాయని కలెక్టర్ వివరించారు. ఈ క్రమంలో అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు అందజేస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చూపు మందగించిన వారు క్రమం తప్పకుండా అద్దాలను ధరిస్తూ, సరైన పోషకాహారం తీసుకుంటే సమస్య నుండి బయటపడవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవి సీజన్ దృష్ట్యా శరీరం డీహైడ్రేట్ కాకుండా అధిక మోతాదులో తాగునీటిని తీసుకోవాలని హితవు పలికారు. అనంతరం కంటి ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి, సరైన సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగస్వాములం అవుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్, అంతకుముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అశ్విని, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ పీ.ఓ డాక్టర్ సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజ్మల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు మరియు వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





## మల్టీస్టారర్ సినిమాలో చాన్స్ దక్కించుకున్న కీర్తి సురేష్

నేషనల్ అవార్డు విన్నర్, 'మహానటి' కీర్తి సురేష్ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ పీరియడ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో వరుస హిట్లు కొడుతూనే, బాలీవుడ్‌లో కూడా 'రఫ్తార్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు ఖాతాలో మరో భారీ తెలుగు సినిమా వచ్చి చేరినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఇటీవల 'శంకర్ వరప్రసాద్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి, ఇప్పుడు ఒక భారీ మల్టీస్టారర్ కథను సిద్ధం చేశారు. ఇక ఇందులో విక్టరీ వెంకటేష్ నందమూరి కళ్యాణ్ రామ్ వంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తుండగా.. కీర్తి సురేష్ హీరోయిన్‌గా అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం. అనిల్ రావిపూడి సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాయి, కాబట్టి కీర్తి ఈ సినిమాలో కొత్త మేనరిజమ్స్‌తో అలరించడం ఖాయమని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు షైన్ స్క్రీన్స్ సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇక ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. పండగ సీజన్‌లో వెంకటేష్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను, కళ్యాణ్ రామ్ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే బాక్సాఫీస్ దగ్గర రికార్డులు తిరగరాయడం ఖాయం అని చెప్పొచ్చు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్, కీర్తి సురేష్ పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయట.

### దూసుకొస్తున్న అనిల్ రావిపూడి..

# అప్పుడే సెట్స్‌పైకి!

టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'హిట్ మెషీన్'గా పేరు తెచ్చుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి.. ఇప్పటివరకు అపజయం ఎరుగని ట్రాక్ రికార్డ్‌తో దూసుకుపోతున్నాడు. మెగాస్టార్ చిరంజీవితో గత సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు'తో ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ అందుకున్న అనిల్.. ఇప్పుడు వచ్చే సంక్రాంతికి మరో బ్లాక్ బస్టర్ కోసం దూసుకొస్తున్నాడు. అయితే, ఈసారి ఒక భారీ మల్టీస్టారర్ చిత్రానికి శ్రీకారం చుడుతున్నారు. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా అదిరిపోయే ఎంటర్టైనింగ్ ఫిల్మ్ చేయబోతున్నాడు. గతంలో అనిల్ రావిపూడి ఈ ఇద్దరు హీరోలతో విడివిడిగా సూపర్ హిట్లను అందుకోగా.. ఇప్పుడు వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూపించబోతుండటంతో అభిమానుల్లో ఈ ప్రాజెక్ట్ భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఇక ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా? అని ఎదురుచూస్తున్న అభిమానులకు తాజాగా ఒక స్పష్టత వచ్చింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2026 జూన్ చివరి వారం నుంచి ప్రారంభం కానుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తన గత చిత్రాల తరహాలోనే ఈ సినిమాను కూడా అత్యంత వేగంగా పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. కేవలం మూడు నాలుగు లాంగ్ షెడ్యూల్స్‌లో చిత్రీకరణను ముగించి, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు వెళ్లాలని చూస్తున్నాడు. ఇప్పటికే.. ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మరి వెంకటేష్ కామెడీ టైమింగ్, కళ్యాణ్ రామ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను తెర పై అనిల్ రావిపూడి ఎలా చూపిస్తాడో చూడాలి.







## మే 1న 'గాయపడ్డ సింహం'.. షరతులు వర్తిస్తాయి!

ఇటీవలే 'ఓం శాంతి శాంతి శాంతి' చిత్రంతో హీరోగా ప్రేక్షకుల్ని పలకరించారు దర్శకుడు తరుణ్ భాస్కర్. ఇప్పుడు 'గాయపడ్డ సింహం'తో మరోసారి అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన.. ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రాన్ని కశ్యప్ శ్రీనివాస్ తెరకెక్కించారు. పవన్ సాదినేని సమర్పణలో సప్తస్య మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. మానస చౌదరి, విష్ణు ఓయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని మే 1న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "టీజర్ చాలా బాగుంది. కాన్సెప్ట్ కూడా బాగా నచ్చడంతో దీన్ని మేమే ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. విడుదల తేదీగా మే 1ని ఖరారు చేశాం. కాకపోతే కండీషన్స్ అప్లై. ఎందుకంటే ఏప్రిల్ 30న 'పెద్ది' విడుదల కానుంది. అది వస్తే.. దీనికి థియేటర్లు ఇవ్వలేని పరిస్థితి ఉంటుంది. అందుకే అవసరం అనుకుంటే వారం వెనక్కి వెళ్లే వెసులుబాటు ఉంటుందని కండీషన్స్ అప్లై అని చెప్పాం" అన్నారు.

## వెండితెర తర్వాత ఇక డిజిటల్ వేట.. వరుస సినిమాలతో సంయుక్త మీనన్ హవా!

టాలీవుడ్‌లో వరుస హిట్లు అందుకుంటూ గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్ ఇప్పుడు ఒక సరికొత్త ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు వెండితెరపై తన అందం, అభినయంతో మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు డిజిటల్ ఎంట్రీ ఇవ్వనుంది. ఈమె తన మొదటి వెబ్ సిరీస్‌ను పట్టాలెక్కించి, ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచడానికి రెడీ అయ్యారు. 'గువ్వల చెరువు ఘాట్' పేరుతో తెరకెక్కుతున్న ఒక భారీ వెబ్ సిరీస్‌లో యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అయితే సంయుక్తతో పాటు కిరణ్ అబ్బవరానికి కూడా ఇదే మొదటి ఓటీటీ ప్రాజెక్ట్ కావడం విశేషం. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్మ ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు.

ఇందులో 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న తేజస్వీరావు కీలక పాత్రలో కనిపించనున్నారు. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో ఎమోషనల్ డ్రామాగా రూపొందుతున్న ఈ వెబ్ సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. భరత్ కమ్మ మార్క్ మేకింగ్‌తో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒకవైపు ఓటీటీ ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, మరోవైపు సంయుక్త మీనన్ చేతిలో అరడజనుకు పైగా సినిమాలు ఉన్నాయి. నిఖిల్ సిద్ధార్థ్ సరసన నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'స్వయంభూ, స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్, బ్లాక్ గోల్డ్ వంటి విభిన్న చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. సినిమాలతో పాటు ఇప్పుడు డిజిటల్ ఎంట్రీతో కూడా సంయుక్త తన సత్తా చాటేందుకు సిద్ధమైంది.



## 'బైకర్' కోసం రంగంలోకి దిగిన ప్రభాస్!

టాలీవుడ్ యంగ్‌స్టర్ శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం బైకర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఏడాది సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి' వంటి చిత్రంతో ప్రేక్షకులను అలరించి సక్సెస్ ట్రాక్ ఎక్కిన శర్వానంద్, ఈసారి స్పోర్ట్స్ డ్రామాతో కొత్త కాన్సెప్ట్‌తో ముందుకు వస్తున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'బైకర్' ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఇప్పటికే ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో మిలియన్స్ ఆఫ్ వ్యూస్ సాధించి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో దూసుకెళ్తోంది. యాక్షన్, ఎమోషన్, స్పోర్ట్స్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ ట్రైలర్ సినిమా మీద అంచనాలను మరింత పెంచింది.

ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ట్రైలర్‌ను షేర్ చేసిన ప్రభాస్, ఇది చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా వైబ్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. అలాగే ఈ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభాస్ లాంటి అగ్ర హీరో నుంచి ప్రశంసలు దక్కడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ప్రభాస్ హోమ్ బ్యానర్ యువీ క్రియేషన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. ఇప్పటి నుంచే ప్రమోషన్స్ మొదలు పెట్టాడు డార్లింగ్. కుదిరితే ఈ సినిమా ఈవెంట్స్‌కు ప్రభాస్ గెస్ట్‌గా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. చిత్ర యూనిట్‌తో ఇంటర్వ్యూ చేసే ఛాన్స్ కూడా లేకపోలేదు. ఇటీవల 'కపుల్ ఫ్రెండ్లీ' టీమ్‌తో కలిసి ఆయన చేసిన సందడి తెలిసిందే. ఇక ఈ చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్రలో నటిస్తుండగా మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మరి తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్న 'బైకర్' సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.






## హరీష్ శంకర్.. నెక్స్ట్ ఏంటి?, 'ఉస్తాద్' పరిస్థితేంటి?

పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాకు మొదటి రోజు నుంచే మిక్స్డ్ టాక్ వచ్చింది. అయినా కూడా ఫస్ట్ డే భారీ వసూళ్లు వచ్చాయి. కానీ, సెకండ్ డే నుంచి కలెక్షన్స్ భారీగా డ్రాప్ అయ్యాయి. మొదటి రోజు ఇండియాలో 35 కోట్ల వరకు రాబట్టిన ఉస్తాద్.. రెండు, మూడో రోజున 9 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. కానీ, నాలుగో రోజు మాత్రం 8 కోట్లు మాత్రమే వసూలు చేసింది. ఇక ఐదో రోజు మండే నాడు ఉస్తాద్ లెక్క మరింత తగ్గింది. రెండు కోట్ల లోపే నెట్ వసూలు చేసింది. దాంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఐదు రోజుల టోటల్ ఇండియా నెట్ కలెక్షన్ రూ. 62 కోట్లకు చేరుకోగా గ్రాస్ రూ. 73 కోట్లకు పైగా ఉంది. ఓవర్సీస్‌లో రూ. 10 కోట్లకు పైగా వసూలు చేయగా.. మొత్తంగా వరల్డ్ వైడ్‌గా ఐదు రోజులకు గాను రూ. 83 కోట్లకు పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

మరి కలెక్షన్స్ ఇలా ఉంటే, ఉస్తాద్ బ్రేక్ ఈవెన్ టార్గెట్ రీచ్ అవుతుందా? లేదా? అనే చర్చ జరుగుతోంది ట్రేడ్ వర్గాల్లో. అలాగే.. డైరెక్టర్ హరీష్ శంకర్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటనే టాక్ కూడా మొదలైంది ఇండస్ట్రీలో. నిజానికి, రవితేజ 'మిస్టర్ బచ్చన్' సినిమాతో డిజాస్టర్ చూశాడు హరీష్. దీంతో.. ఎలాగైనా సరే పవర్ స్టార్ సినిమాతో హిట్ కొట్టాలని అనుకున్నాడు. కానీ, ఉస్తాద్ అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో హరీష్ తర్వాతి సినిమాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే నందమూరి బాలకృష్ణతో ఓ సినిమా ఉంటుందనే టాక్ ఉంది. కానీ, బాలయ్య మాత్రం నెక్స్ట్ వివేక్ ఆత్రేయతో ఓ సినిమా కమిట్ అయ్యారు. అలాగే.. మెగాస్టార్‌తో కూడా ఓ సినిమా ఉంటుందని ఉస్తాద్ ప్రమోషన్స్‌లలో భాగంగా హరీష్ చెప్పుకొచ్చాడు. అయితే, ప్రస్తుతం చిరంజీవి లైనప్ కూడా భారీగా ఉంది. బాబీ, శ్రీకాంత్ ఓదెల లాంటి దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. కాబట్టి, ఈ కాంబినేషన్స్ ఇప్పట్లో సెట్ అయ్యేలా కనిపించడం లేదు. మరి హరీష్ నెక్స్ట్ ప్రాజెక్ట్ ఎవరితో చేస్తాడు? స్టార్ హీరోతో సెట్ అయితే మాత్రం.. ఖచ్చితంగా హిట్ కొట్టాల్సిందేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి హరీష్ ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

